క్లుప్తంగా

తల్లిపాల వారోత్సవాలు

కురవి/మరిపెడ రూరల్/గూడూరు /తొర్రూరు రూరల్: ఆయా మండలాల్లో అంగన్‌వాడీ సెంటర్‌లో ఐసీడీఎస్ వారి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. ఈసందర్భంగా సీడీపీఓలు మాట్లాడుతూ.. తల్లిపాలు పుట్టిన బిడ్డలకు ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక


యాకయ్య, అధ్యక్షుడు

నెల్లికుదురు: టీపీటీఎఫ్ మండల నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా వై.యాకయ్య, ప్రధాన కార్యదర్శిగా సంగ శ్రీనివాస్, జిల్లా కౌన్సిలర్లు వెంకటేశ్వర్లు, నిక్కతున్నీసా, రాజులను ఎన్నుకున్నారు.

యువతకు వాలీబాల్ పోటీలు

గూడూరు: గ్రామీణ ప్రాంతాల్లోని యువకులను సన్మార్గంలో నడిపిస్తూ వారికి ఇష్టమైన క్రీడల్లో నైపుణ్యతను పెంపొందించడమే పోలీసుల లక్ష్యమని సీఐ కె. బాబూరావు అన్నారు. మండల కేంద్రంలోని సర్కిల్ పోలీసుస్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 8వ తేదీన సర్కిల్ పరిధిలోని కొత్తగూడ, గంగారం, గూడూరు మండలాలకు చెందిన యువతకు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల యువకులు ఆయా మండలాల్లోని పోలీసు స్టేషన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, 8వ తేదీన డ్రా తీసి, ఆదే రోజు క్రీడలు ప్రారంభిస్తామన్నారు. ఫైనల్ మ్యాచ్ గూడూరు నందు నిర్వహిస్తామని, విజేతలకు షీల్డు, బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై సీహెచ్. నగేష్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు



చిన్నగూడూరు: దయనీయ పరిస్థితిలో ఉన్న ఓ వృద్ధురాలిని పోలీసులు అండగా నిలిచి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. చిన్నగూడూరు మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు కామారాపు దానమ్మను అయినవారు పట్టించుకోకుండా వదిలేయడంతో ధీనస్థితిలో నివాసముంటుంది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై ఝాన్సీ, మరిపెడ సీఐ హతీరాం సోమవారం వృద్ధురాలి ఇంటికి వెళ్లి పలకరించారు. అనంతరం ఆమెకు నెలకు సరిపడా కిరాణ సరుకులు, 25 కేజీల బియ్యం బస్తా, చీరను అందించి బాసటగా నిలిచారు. పోలీసుల ధాతృత్వానికి స్థానికులు అభినందనలు తెలుపుతున్నారు.

పారిశుద్ధ్య సిబ్బంది లేకుండా స్వచ్ఛదనం ఎలా?

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య సిబ్బంది లేకుండా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ఎలా నిర్వహించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఆలేరు ప్రాథమిక పాఠశాలలో సోమవారం మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల అనధికారికంగా చేసిన బదిలీల్లో ఉపాధ్యాయుల పోస్టుల రేషనలైజేషన్ కారణంగా పాఠశాలల్లో టీచర్ల కొరత ఏర్పడిందన్నారు. బోధన అవసరాలు తీర్చకుండా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని ముఖ్యమంత్రి బాధను వ్యక్తం చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

బయ్యారం: మండలంలోని ఇల్లెందు-మహబూబాబాద్ ప్రధాన రహదారిపై గంధంపల్లి ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బండ్లకుంటకు చెందిన పాయం సాయి(30) గంధంపల్లి నుంచి బయ్యారం వెళ్లేందుకు ఆటో ఎక్కగా అతివేగంగా వచ్చిన డీసీఎం అదుపుతప్పి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ కళాజాత

నర్సింహులపేట: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సోమవారం మధ్యాహ్నం ఎస్పీ ఆదేశాల మేరకు విద్యార్థులకు మూఢనమ్మకాలపై పోలీస్ కళాజాత నిర్వహించారు. ఎస్సై గండ్రాతి సతీష్ ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాల, ఆకతాయిల నుంచి అమ్మాయిల ఆత్మరక్షణపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో షీ టీం పీసీలు పార్వతి, రమేష్, సుప్రజ, జయశ్రీ, రేణుక, సతీష్ పాల్గొన్నారు.

‘స్వచ్ఛదనం-పచ్చదనం’

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభల ద్వారా అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈనెల 9వరకు వివిధ శాఖల భాగస్వామ్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తారు. అధికారులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


నెహ్రూసెంటర్: మొక్క నాటుతున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి


మహబూబాబాద్ అర్బన్: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


కొత్తగూడ: మండల కేంద్రంలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, పోలీసులు


దోర్నకల్: ర్యాలీలో పాల్గొన్న చైర్మన్ వీరన్న, అంగన్‌వాడీలు, తదితరులు


మహబూబాబాద్ రూరల్: మల్యాల గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది


తొర్రూరు: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు


నెల్లికుదురు: మండల కేంద్రంలో..


మరిపెడ: పిచ్చిమొక్కలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది


గూడూరు: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


పెద్దవంగర: బొమ్మకల్లులో..


తొర్రూరు రూరల్: మాటేడులో..


కురవి: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు


కురవి: సీరోలు మండలం కొత్తూరులో..


మరిపెడ రూరల్: గుండెపుడిలో..


చిన్నగూడూరు: విస్సంపల్లిలో..


నర్సింహులపేటలో..


దంతాలపల్లి: మండల కేంద్రంలో..

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

కేసముద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేసి మాట నిలబెట్టుకుంటుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. సోమవారం మండలంలోని బోడమంచ్యాతండా జీపీ శివారు తెల్లబండాతండాలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు పొలంబాట కార్యక్రమంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆ తర్వాత కేసముద్రంస్టేషన్‌లో జైభారత్ అగ్రిమాల్ షాపును ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో 149 కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.2లక్షల పంట రుణాలను మాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలోనే చరిత్ర సృష్టించిందన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

దసరా పండుగ లోపు ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు రూ.2,500 పథకాన్ని అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ జనగాం నరేష్, తహసీల్దార్ దామోదర్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, పీసీసీ సభ్యుడు దస్రూనాయక్, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే వర్గీకరణ


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

మహబూబాబాద్: మనువాదాన్ని పెంపొందించడానికే ఎస్సీ వర్గీకరణ తీర్పు అని అది సుప్రీం కోర్టు తీర్పు కాదని, మోదీ తీర్పు అని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పిల్లి సుధాకర్ మాట్లాడుతూ.. ఆర్టికల్ 341ని సవరించాలంటే పార్లమెంట్‌కే పూర్తి అధికారం ఉందన్నారు. కేవలం రాజకీయ లబ్ధి పొందడానికే ఎస్సీ వర్గీకరణ అన్నారు. సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈనెల 7,8,9 తేదీల్లో ఢిల్లీలో జరిగే దీక్షలను విజయవంతం చేయాలని పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అశోద భాస్కర్, బిక్షం, రమేష్, యాకయ్య, ప్రశాంత్, అనిల్, యాకాంతం, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలి

మహబూబాబాద్ అర్బన్/దోర్నకల్: దొంగతనం అభియోగంతో దళిత మహిళను దారుణంగా కొట్టిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆమె మాట్లాడారు. దొంగతనం కేసులో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధికి చెందిన దళిత మహిళను పోలీసులు తీవ్రంగా కొట్టడం దారుణమన్నారు. కాంగ్రెస్ 8 నెలల పాలనలో 185 అత్యాచారాలు, 500 దోపిడీలు, హత్యలు జరిగాయన్నారు. రాష్ట్రంలో హోంశాఖకు మంత్రి లేడని, హోంశాఖ వ్యవహారాలను సమీక్షించే తీరిక సీఎం రేవంత్‌రెడ్డికి లేదన్నారు. దళిత మహిళ కుటుంబానికి పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

ఈ కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ బిందు, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి


జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

దంతాలపల్లి: ఐక్యంగా పోరాడినప్పుడే తమ హక్కులను సాధించుకోగలుగుతామని గౌడ సంఘం రాష్ట్ర సలహాదారు గునిగంటి మోహన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన అమరుల యాదిలో కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసేలా ఐక్యంగా పోరాడాలన్నారు. ప్రతి గీత కార్మికుడికి రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు తండ రాములు, గుర్రం వెంకన్న, కందునూరి యాదగిరి, చీకటి ఉప్పలయ్య, భూపతి యాకన్న, కన్నా వెంకటనారాయణ పాల్గొన్నారు.

తొర్రూరు సీఐ, ఎస్సైల బదిలీ

తొర్రూరు: తొర్రూరు సీఐ, ఎస్సైలను బదిలీ చేస్తూ సోమవారం రాత్రి పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సీఐ టి.సంజీవ్‌ను ఖమ్మం జిల్లా కూసుమంచికి బదిలీ చేశారు. ఎస్సై కూచిపూడి జగదీశ్‌ను ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంకు బదిలీ చేశారు. కాగా ఎస్సై జగదీశ్ ఇటీవల ఓ యువకుడిని చితకబాదిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అతడిని బదిలీ చేశారని వినికిడి. కాగా సీఐ, ఎస్సైల తీరుపై స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి అసంతృప్తిగా ఉండటంతోనే బదిలీ జరిగిందని స్థానికంగా చర్చ జరుగుతోంది. నూతన సీఐ, ఎస్సై నియామకాలను అధికారులు ప్రకటించాల్సి ఉంది.

వరద బాధితులకు విరాళాల సేకరణ

గార్ల: కేరళ రాష్ట్రంలో వరద బాధితుల కోసం సోమవారం గార్లలో సీపీఎం పార్టీ నాయకులు విరాళాలు సేకరించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గార్ల పురవీధుల్లో ఇంటింటికి తిరుగుతూ విరాళాలు సేకరించారు. క్యార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు, రామకృష్ణ, కోటయ్య, సాయి, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్‌లో..

నెహ్రూసెంటర్: కేరళ వరదబాధితుల కోసం సీపీఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజలు విరివిగా విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వెలుగు శ్రావణ్ పాల్గొన్నారు.

ధర్నా కరపత్రాల ఆవిష్కరణ

నెల్లికుదురు: జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఈనెల అక్రమ డిప్యుటేషన్ల రద్దు కోరుతూ ఈనెల 7న తహసీల్దార్ కార్యాలయాల ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీవన్, శేఖర్, జనార్దన్, రాజయ్య, సునీత, రాజన్న పాల్గొన్నారు.

దోర్నకల్: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్ కోరారు.

పెద్దవంగర: ఇటీవల జరిగిని ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లలో అవకతవకలు జరిగాయని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కోశాధికారి కొండ నాగమల్లయ్య, జిల్లా కార్యదర్శి ఎర్ర వెంకన్న ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని డీఈఓను తొలగించాలని పేర్కొంటూ ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.


నెల్లికుదురు: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నర్సింహులపేట: విద్యారంగ పరిరక్షణ కోసం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 7న తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి నందిగామ జనార్దనచారి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఎస్‌లో జరిగిన సమావేశంలో అయన మాట్లాడారు. లింగరాజు, వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, శ్రావణి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

నర్సింహులపేట: మండలంలో టీపీటీఎఫ్ మండల కమిటీ అధ్వర్యంలో సోమవారం జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి క్రాంతికుమార్, బొమ్మ శ్రీనివాస్, రవికుమార్, శ్రీనివాస్, యాకన్న, రవీందర్, మురళీధర్ పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

కొత్తగూడ: నూతనంగా వచ్చిన ఎస్సై కుశ కుమార్‌ను బీజేపీ మండల నాయకులు సోమవారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వాసం సారయ్య, సారయ్య, రాంచందర్, వెంకట్‌రెడ్డి, కొట్టె శ్రీను, యాకయ్య పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు

బయ్యారం: పదవీ కాలం అయిన పోయిన మండల పరిషత్ సభ్యులను సోమవారం ఘనంగా సన్మానించారు. ఎంపీపీ చేపూరి మౌనిక మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదంతో తమ పాలకవర్గం పలు విధాలుగా ప్రజాసేవలో పాల్గొందన్నారు. వైస్ ఎంపీపీ గణేష్, తహసీల్దార్ విజయ, ఎంపీడీఓ దైవాధీనం, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బయ్యారం: మండలంలోని నామాలపాడులోని ఏకలవ్య పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బానోత్ దేవేందర్, నాయకులు గణేశ్ డిమాండ్ చేశారు. సోమవారం పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సిద్దు, ప్రకాష్, రాఘవేంద్రరావు, వినయ్ పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు

దోర్నకల్: మండలంలోని గొల్లచర్ల గ్రామంలోని పలు వీధుల్లో హైమాస్ట్ ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. సందర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యులు, కాంగ్రెస్ నాయకుడు భూక్యా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ఆదేశాల మేరకు రూ.5.5లక్షల నిధులతో మూడు ప్రాంతాల్లో లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కరాటేలో విద్యార్థినుల ప్రతిభ

దంతాలపల్లి: మండల కేంద్రంలోని అక్షర పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ కరాటే ఛాంపియన్స్-2024 పోటీల్లో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ యాకేష్ మాట్లాడుతూ.. ఆదివారం వరంగల్ మున్సిపల్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీల్లో కీర్తన, కౌన్సియ, భార్గవి, లక్ష్మి, హర్షిత పతకాలు సాధించారన్నారు.

పరామర్శ..

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ వ్యవసాయాధికారి వెన్నం సత్యనారాయణరెడ్డి ఇటీవల మృతిచెందగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ సోమవారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

వీరభద్రుడిని దర్శించుకున్న భక్తులు

కురవి: శ్రావణ మాసం ప్రారంభం కావడంతో తొలి సోమవారం రోజున మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహానేత ఏంగిల్స్

నెహ్రూసెంటర్: ప్రపంచ పీడిత ప్రజలపై సాగుతున్న దోపిడీ, పీడన, అణిచివేతలకు వ్యతిరేకంగా పోరాడిన మార్క్స్‌కు అండగా నిలిచిన మహానేత ఎంగిల్స్ అని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎంగిల్స్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రవి, వీరన్న, సూర్యం, యాకయ్య పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

మహబూబాబాద్: విగ్రహాల పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న స్వామి వివేకానంద, కొమురం భీం విగ్రహాల పనులను సోమవారం చైర్మన్ పరిశీలించారు. ఈనెల 7న రెండు విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈ సురేష్, కర్పూరపు గోపి పాల్గొన్నారు.

నాస్ ఓరియంటేషన్ శిక్షణ

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు నాస్ ఓరియంటేషన్ శిక్షణ సోమవారం నిర్వహించారు. అనంతరం పదవీ విరమణ పొందుతున్న ఎల్టా అధ్యక్షుడు తడకమల్ల బ్రహ్మంను నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు సత్కారించాడు.

సద్వినియోగం చేసుకోవాలి

నెల్లికుదురు: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పునాదులైన ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించేందుకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ప్రతి ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని మునిగలవీడు కాంప్లెక్స్ హెచ్‌ఎం స్వప్న సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సెకండరీ గ్రేడ్ టీచర్లకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్పీలు లింగమూర్తి, రాజు, చంద్రశేఖర్ ఈవీఎస్ గణితం, ఇంగ్లీష్, తెలుగు సబ్జెక్టులపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలి

తొర్రూరు: కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా అర్బన్ అధ్యక్షుడు మంగళపల్లి యాకయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి కార్యాలయ ప్రతినిధులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుమార్, రాజేష్, యాదగిరి, శేఖర్, రాంబాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ రైతు రుణమాఫీ చేయాలి



గార్ల: ప్రభుత్వ ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని మండల సర్వసభ్య సమావేశంలో ఏఓ కావటి రామారావును నిలదీశారు. ఎంపీపీ బట్టు నాగరాజు అధ్యక్షతన సోమవారం గార్లలో చివరి మండల సర్వసభ్య సమావేశం కొనసాగింది. అనంతరం నేటితో ఎంపీటీసీల పదవీకాలం ముగియనుండటంతో సమావేశంలో ఎంపీటీసీలకు శాలువాలతో సన్మానించి మెమొంటోలు అందజేసి వీడ్కోలు పలికారు. సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, ఎంపీడీఓ మంగమ్మ, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, ఎంపీపీ బట్టు నాగరాజు పాల్గొన్నారు.